13112024-MAI-04_Layout 1 11/13/2024 2:18 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

రూపాయి పతనం

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ విజయం కలిగించిన స్ఫూర్తితో డాలర్ బలపడటం అందుకు ప్రధాన కారణం. విశ్వ విపణిలో డాలర్‌కు డిమాండ్ అంతకంతకూ పెరుగుతున్నది. మరోవైపు మన దేశంలోని విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు వాటాలను వేగంగా వదిలించుకుంటున్నారు. దీనివల్ల గత అక్టోబర్‌లో 11 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఎగిరిపోయాయి. నవంబర్‌లో మరో 2 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. భారతీయ షేర్ల ధరల అతి ఉగ్గడింపు, 2వ త్రైమాసికంలో లాభాలు తగ్గిపోవడం వల్ల విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి కనబరచడం లేదు. వీటన్నింటి ప్రభావం వల్ల నవంబర్ 12వ తేదీన రూపాయి మారకం విలువ రూ.84.40కు పడిపోయింది. స్థిరీకరణకు రిజర్వ్ బ్యాంకు చర్యలు చేపడుతున్నప్పటికీ రాబోయే రోజుల్లో రూపాయి మారకం విలువ మరింతగా ఒత్తిడి ఎదుర్కోక తప్పదనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

ట్రంప్ గెలుపు భారత్‌కు సవాళ్లతో పాటు అవకాశాలను ఆవిష్కరిస్తున్నదని అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై ఎస్‌బీఐ రూపొందించిన నివేదిక తెలిపింది. ట్రంప్ రెండో విడత పాలనాకాలంలో రూపాయి విలువ 8-10 శాతం తగ్గిపోతుందని అంచనా వేసింది. అమెరికా ఎన్నికల పర్యవసానంగా భారీగా తగ్గిన రూపాయి విలువ డాలర్ మారకంలో మొదట్లో తగ్గినా తదనంతర కాలంలో అది పుంజుకుంటుందని ఎస్‌బీఐ నివేదిక ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. ప్రపంచంలో అత్యధిక విలువ కలిగిన కరెన్సీల్లో డాలర్‌కు ప్రత్యేక స్థానమున్నది. అంతర్జాతీయ వాణిజ్యానికి డాలర్‌నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. భారత్ కూడా డాలర్ మీదే అధికంగా ఆధారపడుతున్నది. రకరకాల సమస్యల కారణంగా డాలర్ మారకం నుంచి బయటపడే ప్రయత్నాలు ఇటీవలి కాలంలో ఊపందుకున్నాయి. ముఖ్యంగా బ్రిక్స్ వేదికగా ఇందుకు సంబంధించి స్పష్టమైన ఎజెండా రూపుదిద్దుకుంటున్నది.

అక్టోబర్ 24న రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో భారత్ సహా సభ్యదేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయం గురించి ఒక ప్రకటన చేశాయి. సభ్య దేశాల్లోని కేంద్ర బ్యాంకుల సమన్వయంతో కొత్త చెల్లింపుల వ్యవస్థ ఏర్పాటుచేయాలని తీర్మానించుకున్నాయి. తమ మధ్య వాణిజ్యానికి డాలర్ బదులుగా తమ తమ సొంత కరెన్సీల్లో చెల్లింపులు జరపడం ద్వారా ఇది సాధ్యమని భావిస్తున్నాయి. ఇది అమెరికాకు ఏ మాత్రం ఇష్టం లేదు. డాలర్‌ను ఇండియా వదిలేస్తే దిగుమతులపై వంద శాతం సుంకం విధిస్తానని ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్ బెదిరించారు. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా నుంచి రూపాయి మారకంతోనే భారత్ చమురు దిగుమతి చేసుకుంటున్నది. చైనా కూడా తన కరెన్సీని వినియోగించి రష్యా వద్ద చమురు కొంటున్నది. ఇటీవలే బ్రిక్స్ సభ్యత్వం తీసుకున్న మరో చమురు దేశం ఇరాన్‌కూ ఇదే విధానాన్ని విస్తరించే అవకాశాలు దండిగా కనిపిస్తున్నాయి. దీర్ఘకాలికంగా తమ తమ కరెన్సీలను బలోపేతం చేసే దిశగా భారత్ సహా బ్రిక్స్ దేశాలు అడుగులు వేయడం శుభపరిణామం.

మూసీ నదిలో కాసుల వేట..!

ఎవరు అడ్డమొచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదని, బుల్డోజర్ ఎక్కించి మరీ దూసుకువెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భీష్మ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. మూసీ మురుగు నీరు వల్ల చుట్టుపక్కల నివాసితులకు పలు సమస్యలున్నాయనే మాట నిజమే. అందుకే, ఏ పార్టీ కూడా మూసీ నది శుద్ధిని వ్యతిరేకించడం లేదు. కానీ, ఆ పేరుతో పేదల ఇండ్లను కూల్చవద్దని అన్ని పార్టీలు అంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మొదట మూసీ సుందరీకరణ పేరుతో ఇండ్ల కూల్చివేత మొదలైన విషయం అందరూ చూసిందే! అది బెడిసికొట్టడంతో ప్రక్షాళన అనే మాట ఎత్తుకున్నారు. రాష్ట్రంలో మరే సమస్య లేనట్టు కేవలం మూసీ పరీవాహక ప్రాంత ప్రజల కష్టాలపై మొసలి కన్నీరు కారుస్తుండటం విడ్డూరం.

నర్సన్ బద్రి
94401 28169

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా, మూసీల పేరిట స్వప్రయోజనాలను ఆశిస్తున్నారనడంలో సందేహం లేదు. అందుకోసమే ఆయన డైవర్షన్ పాలిటిక్స్‌ను పావుగా వాడుకుంటున్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ మధ్య ప్రభుత్వాలకు ఇవి ఒక ఆయుధంలా పనిచేస్తున్నాయి. ఏదో ఒక సమస్యను లేవనెత్తి, దాన్ని భూతద్దంలో చూపించి మీడియాను, ప్రజల దృష్టిని అటువైపు మళ్లించడమే ప్రభుత్వాల లక్ష్యం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే... వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని ప్రజలకు ఇచ్చిన హామీలను మూడు వందల రోజులైనా నెరవేర్చలేదు. రుణమాఫీ అట్టర్‌ఫ్లాప్ అయింది. డిసెంబర్ 9 నాటికి రైతుల ఖాతాల్లో రూ.13 వేల కోట్లు జమ చేస్తామని కొత్త వాయిదా ఇచ్చారు. సోనియాగాంధీ పుట్టినరోజు తెలంగాణ ప్రజల ఆశల వాయిదాకు వారధిగా పనికి వస్తున్నది. కనీసం ఆ రోజైనా రుణమాఫీ డబ్బు రైతు ఖాతాల్లో వేయకపోతే సోనియమ్మ కూడా నారాజ్ అయ్యే అవకాశం ఉన్నది.

ఇదిలా ఉంటే రైతు భరోసాకు అతీగతీ లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, కల్యాణలక్ష్మి లాంటి సామాన్య జన ఆర్థిక వెసులుబాటు దస్త్రాలు కదలడం లేదు. రాష్ట్ర ఆదాయానికి మించిన హామీలు ఇవ్వడంతో జనం ముందు ప్రభుత్వానికి తల ఎత్తుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఏదో డ్రామా ఆడాలని హైడ్రాను తెరపైకి తీసుకువచ్చారు. ప్రభుత్వ భూములను కబ్జా నుంచి రక్షించేందుకు కంకణం కట్టుకున్నామన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత, కోర్టు మొట్టికాయలు వేయడంతో అది చల్లబడింది. ఆ తర్వాత మూసీ అంశం ముందుకువచ్చింది. ఇక్కడా జనం తిరగబడటంతో ప్రభుత్వం తోక ముడువక తప్పలేదు. నిజానికి ఈ రెండు ప్రాజెక్టులకు ప్రణాళిక అంటూ ఏదీ లేదు. ఏదో హంగామా చేయాలి. హల్‌చల్‌తో అందరి దృష్టి మళ్లించాలి. అదే ప్రభుత్వ అసలు లక్ష్యం. వీటివల్ల అటెన్షన్ డైవర్షన్ అనేది ప్రభుత్వం పాక్షికంగా సాధించిందనే అనాలి.

> **కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ అంశానికి తెరబీయడంతో అన్ని రాజకీయ పక్షాలు కొన్నిరోజుల పాటు దాని చుట్టే తిరిగాయి. అయితే, ఇప్పుడు విపక్షాలు వదిలివేసినా సీఎం మాత్రం పాదయాత్రలు చేస్తూ మూసీని వదలడం లేదు. సీఎంగా తన మొదటి పుట్టినరోజు నాడు ఎక్కువ సమయాన్ని మూసీ ప్రాంతంలో గడిపి ఆ అంశం జోరును తగ్గకుండా జాగ్రత్త పడ్డారు.**

2025, జనవరిలో లక్షల మందితో మూసీ పాదయాత్ర చేస్తానని సీం రేవంత్ ప్రకటించారు. అంత మందితో పాదయాత్ర ఎందుకో నాకైతే అర్థం కాలేదు. అయినా ఇదేం దండి సత్యాగ్రహం కాదు, తెలంగాణ ఉద్యమం అసలే కాదు. మూసీలో మురిగు అలాగే ఉండాలని ఎవరూ కోరుకోవడం లేదు. నిజానికి మూసీ మురికి ఈ మధ్య తలెత్తిన సమస్య కాదు. సుదీర్ఘ కాంగ్రెస్ పాలనలో, ఎన్టీఆర్, చంద్రబాబు జమానాలోనూ మూసీ మురికిగానే ఉన్నది. పరిశ్రమలన్నీ ఏండ్ల తరబడి రసాయన వ్యర్థా లు చాటుమాటుగా మూసీలోకి వదిలివేస్తున్నా ప్రభుత్వాలు కండ్లు, ముక్కు మూసుకున్నాయి.

గత పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీనే తొలిసారిగా మూసీ ప్రక్షాళన కోసం నడుం బిగించింది. నల్గొండ రైతులకు శుభ్రమైన సాగునీటిని అందించేందుకు మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్‌ల నిర్మాణం చేపట్టింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.3,800 కోట్లతో 32 శుద్ధి కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. వాటిలో 8 కేంద్రాల నిర్మాణపనులు చివరి దశకు చేరుకున్నాయి. నిజానికి ఇదే ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో చేపడితే సమస్య కొంతవరకు తీరిపోయేది. కానీ, సీఎం రేవంత్ ఈ విషయాన్ని పక్కనబెట్టి ఇంతవరకు నిర్లక్ష్యానికి గురైందనడమే శుద్ధ అబద్ధం. పైగా అడ్డొచ్చినవారిని రాయికట్టి నీటిలో ముంచుతానని, ఇది ట్రైలర్ మాత్రమే, అసలు సినిమా ముందున్నదనడం సీఎం స్థాయిని తగ్గించడమే. కేసీఆర్ కుటుంబాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకొని నోటికొచ్చింది మాట్లాడటం వల్ల ప్రజల్లో రేవంత్‌రెడ్డిపై గౌరవం తగ్గిపోతున్నది. అందుకేనేమో, ప్రజలు రాయలేని భాషలో ఆయనను తిడుతున్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీల మాటేమోగానీ, మిగతా నాలుగేండ్లలో ఎన్నికల ఖర్చులు రాబట్టుకోవాలి. అధిష్ఠానం ధనదాహం తీర్చాలి. రాష్ట్ర ఆదాయం నెలవారీ ఖర్చులకే సరిపోవడం లేదు. ఏదైనా కోట్లు కుమ్మరించే ప్రణాళిక కావాలి. అందుకు ప్రైవేటు భాగస్వామ్యంతో భారీ ప్రాజెక్టును రచించాలి. దానికి మూసీ సుందరీకరణ ప్రణాళిక బాగా పనికొస్తుంది. అందులో భాగంగానే రివర్ బెడ్ అని ముద్రవేసి ఇండ్లు కూల్చడం మొదలైంది. వ్యతిరేకత రావడంతో నిర్వాసితులను ఏదోరకంగా ఖాళీ చేయించి నదికి రెండువైపులా విదేశీ కంపెనీలతో భారీ నిర్మాణాలు చేపడితే కోరిన అవసరాలు తీరే అవకాశం ఉన్నది. అందుకే ప్రభుత్వ పెద్దలు సియోల్ వెళ్లి, నదికి ఇరువైపులా వ్యాపార సముదాయాలను ఎలా నిర్మించారో చూసి వచ్చారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లో వేల కోట్ల నిర్మాణాల ఒప్పందాలు చేసుకోవచ్చు. కమీషన్లకు కొదువ ఉండదు. అందుకే, ఇచ్చిన హామీల కన్నా, మూసీ సుందరీకరణనే ఇప్పుడు రేవంత్ అసలైన లక్ష్యం. అందుకే అడ్డమొస్తే ఎంతటివారినైనా బుల్డోజర్లతో తొక్కిస్తానని ఆయన బెదిరిస్తున్నారు.

సర్వేలో విశ్వకర్మల ప్రస్తావనేది?

> **మన దేశంలో సామాజికవర్గం (కులం) అనేది వ్యక్తిగత గుర్తింపే కాదు, దానికి ఎంతో ప్రాధాన్యం ఉన్నది. సామాజిక, రాజకీయ, ఆర్థికపరమైన అంశాలు దానితోనే ముడిపడి ఉంటాయి. ప్రజల దైనందిన జీవితాల్లో సామాజిక వర్గానికి ఎంతో ప్రాముఖ్యం ఉన్నప్పటికీ, కులగణన పేరిట సర్వే జరుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం 'విశ్వకర్మ' సామాజిక వర్గాన్ని విస్మరించటం అత్యంత ఖండనీయం.**

కులగణన పేరిట రాష్ట్ర ప్రభుత్వం 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే' చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సర్వే కుల గణనకు మాత్రమే సంబంధించినదా? లేక వ్యక్తిగత విషయాలను కూడా తెలుసుకోవడానికా? అనే విషయం అంతుచిక్కడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వడం లేదు. పైకి మాత్రం 'కులగణన' సర్వే అని చెప్తూనే పౌరుల వ్యక్తిగత వివరాలను కూడా సేకరిస్తున్నది. అయితే, రాజకీయ నేపథ్యాల గురించి కూడా ఆరా తీస్తుండటం విడ్డూరం. సర్వే కోసం సర్కార్ రూపొందించిన దరఖాస్తు తప్పులతడకగా ఉన్నది. కులం అనే శీర్షిక కింద రాష్ట్రంలోని అన్ని కులాలను ప్రస్తావించిన కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ కులాన్ని మాత్రం విస్మరించడం శోచనీయం. విశ్వబ్రాహ్మణ అనేది అనాదిగా వస్తున్న సామాజికవర్గం. ఇందులో పంచదాయిగా పిలిచే ఐదు వృత్తుల వారుంటారు. ఆయా వర్గాల వారికి ప్రభుత్వం 'విశ్వబ్రాహ్మణ' పేరిటనే కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నది. వడ్రంగి, కమ్మరి, కంసాలి, కంచరి, శిల్పి వృత్తుల వారు విశ్వబ్రాహ్మణులుగా గుర్తింపు పొందారు. అయితే, కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో విశ్వబ్రాహ్మణ సామాజికవర్గానికి బదులుగా ఆయా వృత్తులనే కులాలుగా పేర్కొన్నది. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే వృత్తులు వేరే అయినప్పటికీ వారంతా ఒక్క సామాజికవర్గానికి చెందిన వారే. ప్రస్తుతం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల కుల అస్తిత్వమే దెబ్బతినే ప్రమాదం పొంచి ఉన్నది. వృత్తులను కులాలుగా పేర్కొంటూ ఇప్పటివరకు ఏ కులంలోనూ విభజన జరగలేదు. విశ్వబ్రాహ్మణ కులాన్ని మాత్రమే సర్వే నుంచి తొలగించడం పలు అనుమానాలను రేకెత్తిస్తున్నది.

విశ్వబ్రాహ్మణ సామాజికవర్గానికి అనేక విశిష్టతలున్నాయి. ఈ సామాజికవర్గం వారు ప్రధానంగా సనాతన సంప్రదాయాలను పాటిస్తారు. అర్చకత్వం కూడా ఈ కులంలో ఉన్నది. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్, అమరుడు శ్రీకాంతాచారి, ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన మారోజు వీరన్న తదితర విశ్వబ్రాహ్మణ బిడ్డలు ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతగానో పాటుపడ్డారు. అందుకే, తెలంగాణలో విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది.

> **రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అవిరళ కృషిచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సర్వే పేరిట విశ్వబ్రాహ్మణ సామాజికవర్గంపై కుట్రలు చేస్తున్నది. ఐదు సామాజిక వర్గాలుగా విభజించాలనే కుటిల యత్నాలు చేస్తున్నది.**

మన దేశంలో సామాజికవర్గమే అన్నింటికీ ప్రాతిపదిక. జాతీయ బీసీ కమిషన్ కూడా విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ (ఐదు కులవృత్తుల వారు) వర్గాలను ఒక్క సామాజికవర్గంగా పరిగణిస్తున్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదు కులాలుగా విభజించవలసిన అగత్యం ఎందుకు ఏర్పడిందో అర్థం కావడం లేదు. వృత్తులను కులాలుగా పరిగణించడం సరికాదు. రాష్ట్రంలో అన్ని కులాల వారూ వడ్రంగి, కమ్మరి, శిల్పి, స్వర్ణకార వృత్తులను చేపడుతున్నారు. ఇతర రాష్ట్రాల వారు సైతం ఇక్కడికి వచ్చి ఆయా వృత్తులనే జీవనోపాధిగా ఎంచుకుంటున్నారు. అంత మాత్రాన వారిని ఆయా సామాజికవర్గానికి చెందినవారుగా గుర్తిస్తారా? అంతెందుకు, విశ్వకర్మ సామాజికవర్గానికి చెందిన ఒక కుటుంబంలో తండ్రి ఒక వృత్తి ఎంచుకుంటే, ఆయన వారసులు మరో వృత్తిని జీవనోపాధిగా ఎంచుకుంటున్నారు. మరి వారిని ఏ సామాజిక వర్గానికి చెందినవారుగా పరిగణిస్తారు?

ఈ ఐదు వృత్తుల వారి మధ్య ఎప్పటినుంచో బంధుత్వాలు కొనసాగుతున్నాయి. వీరికి గోత్రమే ప్రధానమైనది. వాటన్నింటికీ మూలం విశ్వబ్రాహ్మణ సామాజికవర్గం. చరిత్ర తెలియకుండా వారి మూలాలను చెరిపివేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం హేయం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దరఖాస్తు ప్రతిలో జరిగిన తప్పులను సవరించాలి. విశ్వబ్రాహ్మణ సామాజికవర్గాన్ని ప్రస్తావిస్తూ కమ్మరి, వడ్రంగి, కంసాలి, కంచరి, శిల్పి వృత్తులను పేర్కొనాలి. అంతేకాదు, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్టుగా విశ్వకర్మ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి ఆ సామాజికవర్గానికి చెందినవారినే చైర్మన్, సభ్యులుగా నియమించాలి. లేకుంటే విశ్వబ్రాహ్మణ జాతికి తీరని అన్యాయం చేసినవారవుతారు. అందులో ముద్దాయి ఎవరా అని పరికించి చూస్తే మొదటి వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్ కనపడతారు.

రమేష్ జైనోజు (రామ్ జే), 6301421706
(వ్యాసకర్త: సామాజిక కార్యకర్త, విశ్వకర్మ స్కిల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్)

ఓటమిలోనూ హుందాతనం

ఒత్తిడి లేదా ఓటమిలో హుందాతనాన్ని ప్రదర్శించడమే అసలైన ధైర్యసాహసాలని అమెరికన్ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే చెప్పారు. అయితే, డెమొక్రాటిక్ పార్టీ అమెరికా అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారిస్ ఓటమి తర్వాత అంతకుమించి పరిణతిని చూపించారు. ఇంకా కోల్పోవడానికి ఏమీ లేని పరిస్థితుల్లో, శూన్యంలో నుంచి వచ్చిన హుందాతనం అది. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో మాత్రమే ఓడిపోలేదు, సెనేట్‌లోనూ ఆ పార్టీ తన మెజారిటీని కోల్పోయింది. ఇదొక విధంగా ఆ పార్టీని షాకింగ్‌కు గురిచేసే విషయం. ఒకవేళ కమలా హ్యారిస్ గెలిచి ఉంటే ఆమె సరికొత్త చరిత్ర సృష్టించేవారు. శ్వేత సౌధంలోకి కాలుమోపిన మొదటి మహిళగా, రెండో నల్ల జాతీయురాలిగా, దక్షిణాసియా మూలాలున్న మొదటి వ్యక్తిగా నిలిచేవారు.

వెంకట్ పర్సా

కమలా హ్యారిస్ విజయానికి ఆమె జాతి, లింగం అడ్డంకిగా మారాయా? అన్న ప్రశ్న ఇప్పుడు అందరి మదిని తొలుస్తున్నది. ఒకవేళ అదే నిజమైతే ఉదారవాదానికి పట్టుగొమ్మగా ప్రచారం చేసుకునే అమెరికా దృక్పథం ఇంకా మారలేదని అర్థం చేసుకోవచ్చు. హిల్లరీ క్లింటన్ తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలైన రెండో మహిళ కమలా హ్యారిస్. శ్వేతసౌధంలో ఒక మహిళను చూడటాన్ని అమెరికా ప్రజలు ఇష్టపడటం లేదా? ఇప్పటికీ వారు అందుకు సిద్ధంగా లేరా? అన్న ప్రశ్నలను ఆమె ఓటమి లేవనెత్తుతున్నది. అంతేకాదు, అమెరికాలో శ్వేతజాతీయుల ఆధిపత్యం ఇంకా కొనసాగుతున్నదని దీని ద్వారా తెలుస్తున్నది. కమలా హ్యారిస్ ఓటమిలో ఈ రెండూ కీలకపాత్ర పోషించాయి. అయితే, ఈ అంశాలు ఆమె పోరాటంపై ఏ మాత్రం ప్రభావం చూపలేదనడంలో ఎలాంటి సందేహం లేదు.

వాస్తవానికి, క్లిష్ట సమయంలో జో బైడెన్ అమెరికా అధ్యక్షునిగా ఉన్నారు. గత నాలుగేండ్లు అధికార డెమొక్రాటిక్ పార్టీకి గడ్డుకాలం నడిచింది. కరోనా సంక్షోభం, ఆర్థిక కష్టాలు, నిరుద్యోగం, గాజా-ఇజ్రాయెల్, ఉక్రెయిన్-రష్యా యుద్ధాలు డెమొక్రాట్లను బాగా దెబ్బతీశాయి. బైడెన్ పట్ల వ్యతిరేక పవనాలు వీస్తున్నప్పటికీ, రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నప్పటికీ.. డెమొక్రాటిక్ పార్టీ నుంచి జో బైడెన్ మళ్లీ అధ్యక్ష బరిలో నిలిచారు. పోటీ నుంచి ఆయనను తప్పించడానికి మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్ రంగంలోకి దిగాల్సి వచ్చింది. డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌కు ముందు కమలా హ్యారిస్ నామినేషన్‌కు మార్గం సుమగం చేసేందుకు జో బైడెన్‌కు 11 గంటల సమయం మాత్రమే ఇచ్చారు. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కమలా హ్యారిస్‌ను అధికారికంగా ప్రకటించిన తర్వాత ఆమెకు 107 రోజుల సమయం మాత్రమే మిగిలింది. అప్పటికే బైడెన్ ఎన్నికల ప్రచారంలో పట్టు కోల్పోయారు. పాపులర్ రేటింగ్‌లోనూ ఆయన వెనుకబడ్డారు. డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన టీవీ డిబేట్‌లోనూ ఘోరంగా తడబడ్డారు.

> **డెమొక్రాటిక్, రిపబ్లికన్ పార్టీల అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగే టీవీ డిబేట్లకు ఘన చరిత్ర ఉన్నది. 1960లో మొదటిసారి ఈ డిబేట్ ప్రారంభమైంది. డెమొక్రాటిక్ అభ్యర్థి జాన్ ఎఫ్ కెన్నెడీ, రిపబ్లికన్ అభ్యర్థి రిచర్డ్ ఎం నిక్సన్ మధ్య మొదటి డిబేట్ జరిగింది. ఆ ఎన్నికలో నిక్సన్‌పై కెన్నెడీ గెలుపొందారు. కానీ, 2024లో జరిగిన డిబేట్‌లో బైడెన్ గందరగోళానికి గురై డెమొక్రాటిక్ పార్టీ ఆశలపై నీళ్లు చల్లారు. అక్కడినుంచే ఆ పార్టీ గెలుపు అవకాశాలకు గండిపడ్డాయి.**

అయినప్పటికీ, కమలా హ్యారిస్ ఆ అంతరాన్ని పూడ్చగలిగారు. హోరాహోరీగా సాగిన పోరులో ట్రంప్‌కు ఆమె గట్టి పోటీ ఇచ్చారు. అతి తక్కువ సమయమే ఉన్నప్పటికీ ప్రభావవంతంగా ప్రచారం చేయడానికి ఆమె చాలా కష్టపడ్డారు. ఒక నెరేటివ్‌ను సృష్టించడానికి, ఒక విజన్‌ను ఆవిష్కరించడానికి, తన మద్దతుదారులు, ప్రజల్లో ఉత్సాహం తీసుకురావడానికి ఆమె దేశమంతటా సుడిగాలి పర్యటనలు చేశారు.

మంచి సమాజాన్ని నిర్మించడం, ప్రజలను ఏకం చేయడం, అమెరికా భవిష్యత్తు కోసం దేశంపై ప్రేమతో ఉత్సాహంగా పోరాటం చేయడం తదితర విషయాల్లో కమలా హ్యారిస్ చాలా ఉత్సుకతతో ఉన్నారు. 'మనల్ని విడదీసే అంశాల కంటే మనందరినీ కలిపి ఉంచే ఉమ్మడి అంశాలే ఎక్కువగా ఉన్నా'యని ఆమె ఇటీవల పేర్కొన్నారు. ఆమె ఓటమి పాలవడం విచారకరం. అయినప్పటికీ, హుందాతనంతో 'నేను ఈ ఎన్నికలను అంగీకరిస్తా. కానీ, ఎన్నికల ప్రచారానికి ఆజ్యం పోసిన పోరులో మాత్రం వెనకడుగు వేయ'నని ఆమె అన్నారు. అంతేకాదు, అమెరికా ప్రజలకు భవిష్యత్తుపై ఆశ కల్పిస్తూ ఓటమి అనంతరం కమల సందేశమిచ్చారు. 'కొన్నిసార్లు పోరాటానికి ఎక్కువ సమయం పట్టవచ్చు. అంటే, దానర్థం మనం గెలవలేమని కాదు, ఎట్టి పరిస్థితుల్లోనూ పోరాటాన్ని మధ్యలో ఆపవద్దు. ప్రపంచాన్ని మరింతగా మెరుగుపరిచే ప్రయత్నాన్ని అస్సలు ఆపవద్దు' అని ఆమె పేర్కొన్నారు. ఓటమిని అంగీకరిస్తూ కమలా హ్యారిస్ చేసిన ప్రసంగంలో డెమొక్రాటిక్ పార్టీ భవిష్యత్తును ఆమె ఆవిష్కరించారు. డెమొక్రాట్లు చేయాల్సిన పోరు గురించి వివరించారు. భావోద్వేగంతో కూడిన తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ ఆమె చేసిన స్ఫూర్తిదాయకమైన ప్రసంగంలో ఇలా అన్నారు. 'స్వేచ్ఛ కోసం పోరాటం, అవకాశం కోసం పోరాటం, ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాటం, మన దేశం గుండెల్లో ఉన్న ఆదర్శాల కోసం పోరాటం. అమెరికా ఉత్తమంగా ప్రతిబింబించే ఆదర్శాల కోసం జరిగే పోరాటాన్ని నేను ఎప్పటికీ ఆపను' అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఆదర్శ రాజకీయాలు రిపబ్లికన్ క్యాంప్‌లో కరువయ్యాయి. కమలపై ట్రంప్ వ్యక్తిగత విమర్శలకు దిగడమే ఇందుకు తార్కాణం.

ఎన్నికల్లో ఓడిపోయి, డెమొక్రాట్లు తీవ్ర నిరాశలో ఉన్న ప్రస్తుత తరుణంలో భవిష్యత్తుపై కమలా హ్యారిస్ ఆశలు కల్పిస్తున్నారు. భవిష్యత్తు కోసం పోరాడాలనుకుంటున్న డెమొక్రాటిక్ పార్టీ మద్దతుదారుల్లో ఉన్న ఉత్సాహాన్ని, కాంక్షను ఆమె మరింతగా రగిలించారు. ఈ క్రమంలో హ్యారిస్ ఇలా మాట్లాడారు. 'చీకటిగా ఉన్నప్పుడే నక్షత్రాలను చూడగలమనేది ఒక సామెత. మనం ఇప్పుడు చీకట్లోకి ప్రవేశిస్తున్నామని చాలామంది అనుకుంటున్నారని నాకు తెలుసు. అయితే, అది మనందరి మంచికే జరుగుతున్నది. ఇక్కడో విషయం చెప్పుకోవాలి. అదేమిటంటే.. ఆశావాదం, విశ్వాసం, సత్యం, సేవ లాంటి బిలియన్ల కొద్దీ అద్భుతమైన నక్షత్రాల కాంతితో అమెరికా అనే ఆకాశాన్ని నింపుదాం' అని పేర్కొంటూ భవిష్యత్తుపై ఆశావాదంతో ఆమె ముందుకుసాగడం విశేషం.



వాళ్ల బ్యాగుల్లో బట్టలే ఉన్నాయా?

మా బ్యాగులు, వాహనాలు, ఇండ్లను తనిఖీ చేస్తున్న ఈడీ.. మోదీ, షా, ఫడ్నవీస్, షిండే, అజిత్ పవార్‌ల వాహనాలను మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తున్నది. వాళ్ల బ్యాగుల్లో బట్టలు మాత్రమే ఉన్నాయా? గతంలో ఒడిశాలో మోదీ హెలికాప్టర్‌ను తనిఖీ చేసిన అధికారి సస్పెండ్ అయ్యాడు. మోదీకి నిబంధనలు వర్తించవా? ఇదెక్కడి న్యాయం?

- సంజయ్‌రౌత్, శివసేన (యూబీటీ) ఎంపీ